క్లుప్తంగా

డీపీఎస్‌కు పురస్కారం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు మరో పురస్కారం లభించింది. దేశంలోని వివిధ పాఠశాలలను బ్రెయిన్‌ఫీడ్ మ్యాగజైన్ వారు వివిధ కోణాలలో పరిశీలించి 500 పాఠశాలలకు బహుమతులు అందజేశారు. ఇందులో 2022–23 సంవత్సరానికిను గానూ డీపీఎస్ స్కూల్ ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ అవార్డును అందుకున్నారు. పాఠశాల ప్రోవైస్ చైర్మన్ నరేంద్రబాబు మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ఈ అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా అభినందించారు.

వణుకూరులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: వణుకూరు గ్రామంలో వ్యక్తి పై పలువురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరుకు చెందిన బడుగు తేజపై అదే గ్రామానికి చెందిన షేక్ ఖాదర్, భాను, జంటి అనే వ్యక్తులు పాత కక్షలతో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

పెనమలూరు: కానూరులో యువతి అదృశ్యం కావటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్. గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు లో అపార్టుమెంట్‌లో పని చేస్తున్న నాగులపల్లి మరియమ్మ కుమార్తె (16) ఇంట్లో ఉంటుంది. అయితే ఆమె బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కోడి పందేలు వేస్తున్న 8మందిపై కేసులు

పెనమలూరు: కోడి పందేలు వేస్తున్న ఎనిమిది మంది వ్యక్తులపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తున్న పెనమలూరుకు చెందిన షేక్.దుర్గావలి, షేక్.షాబుద్దిన్, షేక్.శివనాగు, షేక్.సలీంబాషా, ఆరేపల్లి కృష్ణ, యనమలకుదురుకు చెందిన షేక్ బాజీ, కానూరుకు చెందిన బాలయ్య, పటమటకు చెందిన నందూరిరామకృష్ణలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

పెనమలూరు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఓటు నమోదు పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు నిండిన విద్యార్థులు విధిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. రాజ్యాంగ పరంగా సంక్రమించిన ఓటును బాధ్యతతో వినియోగించాలన్నారు. అనంతరం 18 సంవత్సరాలు వయస్సు నిండిన విద్యార్థులతో ఆన్‌లైన్‌లో ఓటు హక్కుకు దరఖాస్తు చేయించారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

ఉయ్యూరు: జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. మున్సిపాలిటీలోని 4, 11 వార్డుల్లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉయ్యూరు పట్టణంలో జగనన్న లే అవుట్‌లో వసతులు కల్పించామన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావాలన్నారు. విశ్రాంత డీఈ 100 ఇళ్లు నిర్మించేందుకు ముందుకు వచ్చారన్నారు. నిర్మాణదారులకు అంగీకారం అయితే భవన నిర్మాణాలు చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు రూ.30 వేలు వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు రూ.30 వేలు విరాళాన్ని అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు గద్దె నాగభూషణం జ్ఞాపకార్థం ఆయన మనవళ్లు మూల్పూరు ఫణిరత్న, కొల్లూరి భాను ప్రకాష్, కొల్లూరు తరుణ్ సాయిలు ఈ మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మలకు గురువారం అందించారు. ఈ మొత్తంపై ఏటా వడ్డీతో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గద్దె శ్రీలక్ష్మీ, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గెలుపు సాధ్యం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, వేదికపై ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: వైఎస్సార్ సీపీ తిరిగి అధికారం చేపట్టడానికి, పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ అన్నారు. పెనమలూరు సెంటర్‌లో గురువారం పెనమలూరు నియోజకవర్గ ముఖ్య నేతలు, సర్పంచిలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులకు జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో జగనన్న పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రజల అండతో గెలిచారన్నారు. ఆయన అధికారం చేపట్టిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేశారని తెలిపారు. గ్రామాల్లో సుపరిపాలనకు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలకు ప్రజాపాలన అందించారన్నారు. మరో ఏడాదిన్నరలో ఎన్నికలు వస్తున్నందున పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. జగనన్నను గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. సచివాలయ కన్వీనర్లతో కలిసి పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉంటే పార్టీ శ్రేణులకు తగిన గౌరవం ఉంటుందన్నారు.

టీడీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి..

రాష్ట్ర ప్రభుత్వంపై టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. జగనన్న సీఎం అయిన తర్వాత సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ఆత్మగౌరవం పెంచారన్నారు. రైతులు, విద్యార్థులు, అక్కచెల్లెమ్మలు, పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రతి గ్రామంలో వివిధ పథకాల ద్వారా రూ. 15 కోట్ల నుంచి రూ. 50 కోట్ల మేర సాయం అందించారనానరు. పేదలు అభివృద్ధి చెందుతుంటే చూసి ఓర్వలేక టీడీపీ నేతలు ఇదేం కర్మ అని రోడ్ల వెంట తిరగుతోందని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు రావిపాటి సత్యశ్రీనివాస్, ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, మండల పార్టీల కన్వీనర్లు కిలారు శ్రీనివాసరావు, దాసే రవి, జంపాన ఏడుకొండలు, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, అన్నే చిట్టిబాబు, సర్పంచిలు, పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామ కమిటీతో ప్రత్యేకంగా మాట్లాడిన పరిశీలకులు, వారి అభిప్రాయాలు సేకరించారు. వీటిని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

వనితలే నిర్ణేతలు

- గన్నవరం నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,61,840
- పెనమలూరు నియోజకవర్గంలో 2,74,631 మంది ఓటర్లు

గన్నవరం: నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2,61,840 మందికి చేరుకుంది. ఈ మేరకు నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను ఎన్నికల నమోదు అధికారిణి బి. చంద్రలీల గురువారం విడుదల చేశారు. మొత్తం ఓటర్లలో పురుషులు 1,26,973 మంది ఉండగా, మహిళలు 1,34,842 మంది, ఇతరులు 25, రక్షణ రంగంలోని సర్వీస్ ఓటర్లు 74, విదేశాల్లో ఉన్న భారతీయ ఓటర్లు 44 మంది ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకుగాను 1,062 మంది మహిళా ఓటర్లు చొప్పున పురుషులు కంటే మహిళా ఓటర్లు 7,869 మంది ఎక్కువ ఉన్నట్లు వివరించారు. నియోజకవర్గంలో ఉన్న 3,54,020 జానాభా అంచనా ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు 740 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. గతేడాది పోల్చితే 3,946 మంది ఓటర్లు తగ్గినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 301 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. తుది ఓటర్ల తుదిజాబితాలను సదరు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. సదరు జాబితాలను ఓటర్లు సరిచూసుకోవచ్చని తెలిపారు.

మండలాల వారీగా ఓటర్ల జాబితా వివరాలు

మండలం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
విజయవాడ రూరల్	77	38,501	39,846	7
గన్నవరం	86	34,480	37,169	9
బాపులపాడు	83	33,577	35,680	3
ఉంగుటూరు	55	20,415	22,147	6

మండలం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
పెనమలూరు	1,59,960	78,253	81,706	1
కంకిపాడు	53,452	25,773	27,678	1
ఉయ్యూరు	61,219	29,656	31,563	-

పెనమలూరు నియోజకవర్గంలో..

పెనమలూరు/కంకిపాడు: నియోజకవర్గ ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు గురువారం ప్రకటించారు. మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,74,631 మంది ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 1,33,682 మంది, మహిళా ఓటర్లు 1,40,947 మంది, ఇతరులు ఇద్దరు చొప్పున ఉన్నారు.

అన్ని వర్గాలకు సంతృప్త స్థాయిలో పథకాలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: జగనన్న పాలనలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన గురువారం చోడవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్ అందచేసి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పాదయాత్రలో జగనన్న పేద ప్రజలకు ఇచ్చిన హామీలు అధికారం చేపట్టి వెంటనే అమలు చేశారన్నారు. పేదలు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి నవరత్నాలు అమలు చేస్తున్నారని తెలిపారు. నేడు అర్హులైన ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాయన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు.

టీడీపీ వైఖరి చెప్పాలి...

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై టీడీపీ తన వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై టీడీపీ ప్రతినిత్యం బురద జల్లుతోందన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలా వద్దా అనే విషయం టీడీపీ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచి కాకర్ల వెంకటరత్నం, ఉపసర్పంచి పి.సాంబయ్య, వైఎస్సార్ సీపీ నేతలు మండూరు కోటేశ్వరరావు, మానికొండ సూర్యతేజ, దివినాగఫణీంద్ర, గజ్జలకొండ రాము, కలతతోటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



ఉయ్యూరు: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు పోటీపడే విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కృష్ణా, గుంటూరు జిల్లాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనం కింద 9,10, ఇంటర్ విద్యార్థులకు నెలకు రూ. వెయ్యి ఉపకార వేతనంగా అందిస్తుందన్నారు. విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి లక్ష్యాన్ని సాధించే దిశగా విద్యార్థులు శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పద్మారాణి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ రమణ పాల్గొన్నారు.

13 నుంచి పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ , ఈవో పాతూరి లోకేశ్వరి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 13 నుంచి సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ నిబంధనలను పాటిస్తూ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12న అమ్మవారికి పుట్టింటి వారసులచే పసుపు, కుంకుమ నూతన వస్త్రాల బహూకరణ జరుగుతుందన్నారు. 13న భోగి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి ఆలయ దర్శనం, వాహన పూజలు, మొక్కుబడులు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14 మకర సంక్రాంతిన విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, కుంకుమ పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న ఆలయ సమీపంలోని రైవస్ కాలువలో తెప్పోత్సవం, రాత్రి రావిచెట్టు ఎదుట పూలంగి (ఊయల) సేవ ఉంటుందన్నారు. 20న ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. కోవిడ్ నిబంధనల్లో భాగంగా భక్తులకు గర్భాలయ దర్శనాన్ని నిషేధించామన్నారు. ఉత్సవాల్లో భాగంగా జరిగే గ్రామోత్సవానికి సంబంధించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశామని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పెర్కొన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు నూకల పుల్లయ్య, మంగిశెట్టి చైతన్య, అడ్డగిరి దుర్గారావు, దొండపాటి అచ్యుతరావు, చాగంటిపాటి పద్మావతి పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



ఆత్కూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ సరోజిని

ఉంగుటూరు: పలు గ్రామాల్లో నూతనంగా మంజూరైన ఫించన్లు కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన గ్రామ కన్వీనర్ల చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్లు పంపిణీ ప్రాంతంలో పండుగ వాతావరణంలో నెలకొంది. ఆత్కూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సరోజిని పాల్గొని గ్రామ కన్వీనర్లతో కలసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. గ్రామ సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ శివలక్ష్మి, మేరీ, కోఆప్షన్ సభ్యుడు గాలీబ్, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్‌డీ బాషా పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల స్థాయిలో కొత్త పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మండలంలో కొత్తగా మంజూరైన 420 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా వైఎస్సార్ పింఛన్ కానుక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, కొత్త పింఛన్ లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం విడుదల

విజయవాడ రూరల్: మండలంలోని మండల పరిషత్ సభ్యులకు రెండు క్వార్టర్ల గౌరవ వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్టు ఎంపీడీఓ(ఇన్‌చార్జి)బీవీ శేషగిరిరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2022–23వ సంవత్సరానికి గాను ఏప్రిల్, మే, జూన్ నెలలకు మొదటి విడత క్వార్టర్‌కు రూ. 3.53లక్షలు, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు రెండో క్వార్టర్‌కు మరో రూ. 3.53లక్షలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మండలంలో 41 మంది ఎంపీటీసీ(కో ఆప్షన్ తో కలిపి)సభ్యుల బ్యాంక్ ఖాతాలకు జమచేస్తామని ఆయన తెలియజేశారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

నున్న(విజయవాడ రూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పలు గ్రామాల్లో విఫ్స్ ప్రోగ్రామ్(వీక్లీవస్స్)జరిగింది. ఈ సందర్భంగా హైస్కూల్‌లో విద్యార్థులకు, ఎలిమెంటరీ స్కూల్స్ విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారికి ఐరన్ టాబ్లెట్స్‌ను వైద్య సిబ్బంది అందజేశారు. నున్న గ్రామంలో జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులకు, పాతపాడు, మంగళాపురం, గ్రామాల్లో ఎలిమెంటరీ స్కూల్స్ విద్యార్థులకు, పి.నైనవరం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు, అంబాపురం గ్రామంలో సీఎస్‌ఐ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు చేసి, ఐరన్ ట్యాబ్లెట్స్‌ను అందజేశారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో జెడ్పీటీసీ

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన జగనన్న స్ఫూర్తి పుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి చేతుల మీదుగా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన జగనన్న స్ఫూర్తి పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల పీడీ శ్రీహర్ష, ఉపాధ్యాయులు సునీత, రమణ, సుజాత, శేషగిరిరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముద్ర వేసుకున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని పీఏసీఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో వైఎస్సార్ పింఛన్ కానుక నూతన లబ్ధిదారులకు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో నూతనంగా మంజూరైన 349 మంది లబ్ధిదారులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదగా రూ.2,750 చొప్పున ఫించన్లు అందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. వైస్ ఎంపీపీ చందు రమాదేవి, ఎంపీడీవో ప్రభాకరరావు, సర్పంచ్‌లు సరిపల్లి కమలాభాయి, పిల్లా అనిత, కట్టుబోయిన నాగమణి, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహ మూర్తి, పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

2.25 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

- కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



కొడాలిలో రైస్‌మిల్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఘంటసాల(అవనిగడ్డ): కృష్ణా జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ 2.25 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, కొడాలిలో గురువారం కలెక్టర్ పర్యటించారు. శ్రీకాకుళంలో సచివాలయం, పాఠశాలను ఆయన సందర్శించారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, స్పందన అర్జీల పరిష్కారం వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలు, తక్కువ ఎత్తు, బరువు ఉన్న పిల్లలకు అందిస్తున్న ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల గురించి ఆరా తీశారు. సచివాలయం వద్ద ప్రదర్శించిన లబ్ధిదారుల వివరాల జాబితాను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి నాడు – నేడు పనుల పురోగతిని పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశించారు. పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లు, ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న సచివాలయ, ఆర్‌బీకే భవన నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

50 శాతం ధాన్యం సేకరించాం..

కృష్ణా జిల్లాలో ఇప్పటివరకు 50 శాతం అంటే 2.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. కొడాలిలో ధాన్యం సేకరిస్తున్న రైస్‌మిల్‌ను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి పండుగ అనంతరం ధాన్యం సేకరణను వేగవంతం చేసేందుకు గోనె సంచులను సిద్ధంగా ఉంచామని చెప్పారు. ధాన్యం సేకరణ, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా స్థాయిలో ఫోన్ నెంబర్‌ను అందుబాటులో ఉంచామని, ఏమైనా సమస్యలు ఉంటే ఫోన్ చేస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. కొడాలిలో ధాన్యం సేకరణ చేస్తున్న రైస్‌మిల్‌ను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఐ. కిషోర్, డీఈఓ తాహెరా సుల్తానా, డీఎస్‌ఓ వి. పార్వతి, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ వీరాస్వామి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మనోహరరావు, తహసీల్దార్ రామ్‌నాయక్ పాల్గొన్నారు.

ఈ-శ్రమ్‌ను సద్వినియోగం చేసుకోండి

విజయవాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్ లో అసంఘటిత రంగ కార్మికులుగా నమోదు కావాలని కార్మికశాఖ డెప్యూటీ కమిషనర్ ఎంప శ్రీనివాసరావు ఓ ప్రకటనలో కోరారు. అసంఘటితరంగ కార్మికులుగా నమోదైన వారికికి సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అందుతాయని వివరించారు. ప్రతి కార్మికుడికి ఒక ఏడాది పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2లక్షల ప్రమాద మరణ, అంగవైకల్య బీమా ఉచితంగా అందిస్తారన్నారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌తో గ్రామ, వార్డు సచివాలయంలో నమోదు చేసుకోవచ్చని సూచించారు.

కళాశాల ఫీజులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



విద్యార్థినులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కోట్లు

గన్నవరం: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామానికి చెందిన అక్కచెల్లెళ్లు షేక్ పర్వీనా, రహిమాకు కళాశాల ఫీజులు నిమిత్తం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ. 60 వేలు ఆర్థిక సాయం చేశారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో గురువారం మాజీ ఏఎంసీ చైర్మన్ కొమ్మా కోట్లు, ఆ గ్రామ సర్పంచి శీలం రంగారావు చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా కోట్లు మాట్లాడుతూ.. పేద కుటుంబానికి చెందిన పర్వీనా, రహిమాలు ఎంబీఏ పూర్తి చేసినప్పటికీ పెండింగ్ ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. వీరిరువురు సర్టిఫికెట్లు లేకపోవడంతో ఉద్యోగ ప్రయత్నాలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ విషయాన్ని ఆ గ్రామ సర్పంచి ద్వారా తెలుసుకున్న వంశీమోహన్ వెంటనే స్పందించి ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఎనికేపాడు సర్పంచ్ రాచమల్ల పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, కోనేరు సుబ్బారావు, బి. రాజేంద్రప్రసాద్, కైలే శివకుమారి, చెన్ను కమల్‌రాజ్, బొప్పన కృష్ణ, పైలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

గన్నవరం: సంక్రాంతి పండుగ సందర్భంగా గన్నవరం సబ్ డివిజన్ పరిధిలో జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కె. విజయపాల్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే సబ్ డివిజన్ పరిధిలో పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే స్థావరాలను గుర్తించి నిరంతర పోలీస్ నిఘా పెట్టినట్లు చెప్పారు. అంతే కాకుండా 12 మంది జూద నిర్వాహకులపై సస్పెక్ట్ షీట్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల హెచ్చరికలను లెక్కచేయకుండా కోడిపందేల బరులు సిద్ధం చేసిన, పేకాట, గుండాట, లాటరీ వంటి ఆటలు ఆడితే మాత్రం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి కోర్సులకు దరఖాస్తులు

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో పలు స్వయం ఉపాధి కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, కార్ డ్రైవింగ్, టైలరింగ్ కోర్సులు ఈ నెల 17 నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. శిక్షణ రెండు నెలలు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పొందే వారికి ఉచిత భోజనం, వసతి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు, కుట్టు మిషన్లు, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 9347956659 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

రౌడీ షీటర్ మండవకు ఆరు నెలలు జైలు

గన్నవరం: భూ ఆక్రమణ కేసులో నిందితుడైన రౌడీ షీటర్ మండవ వెంకటేశ్వరరావుకు ఆరు నెలలు జైలుశిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసన్న ఇచ్చిన సమాచారం మేరకు.. వీకేఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ యు. స్వర్ణకుమారి కోడలైన నీలిమకు చెందిన మర్లపాలెం రోడ్డులోని 15 సెంట్ల స్థలాన్ని 2015 అక్టోబర్ 3న ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. పదిహేను మంది వ్యక్తులను తీసుకువచ్చి సదరు స్థలంలోని షెడ్డును, గేట్లను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై స్వర్ణకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా, అప్పటి నుంచి విచారణ 12వ ఏఎంఎం కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం నేరం రుజువు కావడంతో వెంకటేశ్వరరావుకు జైలుశిక్ష విధిస్తూ జడ్జి బి. శిరీష తీర్పు ఇచ్చారు.

గోధుమలు సరఫరా చేయాలి

కంకిపాడు: రేషన్ షాపుల ద్వారా గోధుమలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా కోరారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. బియ్యానికి బదులుగా జొన్నలు, రాగులు రెండు కిలోలు తీసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించటం హర్షణీయమన్నారు. వీటితో పాటుగా గోధుమలు కూడా సరఫరా చేస్తే ప్రజారోగ్యానికి మేలు జరుగుతుందన్నారు.